## క్లుప్తంగా

### పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో నడిపించాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### భవిత సెంటర్‌తో దివ్యాంగులకు లాభం



మేదరమెట్లలో మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్టు ఇందిర

మేదరమెట్ల: భవిత సెంటర్‌ను మండలంలోని అన్ని పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్టు ఇందిరాప్రియ అన్నారు. మేదరమెట్ల వైసీ పాఠశాలలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు సూచనలు, సలహాలను గురువారం అందించారు. ఆమె మాట్లాడుతూ కాళ్ళు చేతులు సక్రమంగా పని చేయని పిల్లలు, నరాల బలహీనతకలిగిన పిల్లలు ప్రతి గురువారం భవిత కేంద్రానికి వచ్చి వ్యాయామ పద్ధతులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, కొండయ్య, రవిశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### అన్న ప్రసాదం పంపిణీ

అద్దంకి: ప్రతినెలా అమావాస్య రోజు నిర్వహించే అన్న ప్రసాద వినియోగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందినారు. అన్నప్రసాదాన్ని.. సంపతి చెన్నయ్య గారి మోక్షార్థం భార్య సీతమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు.. భార్య అంజలి, కుటుంబ సభ్యులు సమర్పించారు.

### కల్తీ మద్యం విక్రయిస్తే జైలుకే..



మద్యం దుకాణం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై

అద్దంకి రూరల్: కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని అద్దంకి ఇన్‌చార్జి ఎస్సై హర్షవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం అద్దంకిలోని ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. వైన్ షాపుల యజమానులు సమయాపాలన నిర్వహిచాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### 27న పూనూరులో వైద్య శిబిరం

యద్దనపూడి: కాటూరి మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో అత్యాధునిక వైద్య సౌకర్యం కలిగిన పరికరాలతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ వ్యాధులు, గుండె, గైనకాలజీ, స్త్రీల వ్యాధులు, ఎముకలు,కీళ్ళు, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీలతో పాటు జనరల్ సర్జన్‌లు వంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

### జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారికి అమావాస్యను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ జగదాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కొమ్మమూరు కాలువపై ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదకరమైన మలుపులో ప్రయాణిస్తున్న టిప్పర్



ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న భారీ వాహనాలు

# క్షణక్షణం.. భయం..భయం!

- కొమ్మమూరు కాలువపై ప్రయాణం హడల్
- ప్రమాదకరంగా వంతెనలు
- ఆందోళనలో ప్రయాణికులు, రైతులు

కారంచేడు:

మండలంలోని కుంకలమర్రు–కారంచేడు రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లాకు సాగు, తాగునీటి సరఫరా చేసే కొమ్మమూరు కాలువ కట్టమీద నెలకొల్పిన ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే హడలిపోవాల్సిందే. గ్రామీణ ప్రాంత రహదారులను సైతం ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకొనే అధికారులు, పాలకులు, అధికారులు ఎక్కడని కుంకలమర్రు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ రహదారిలో ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు ఏ విధంగా ప్రమాదాలకు గురి చేస్తాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కారంచేడు–కుంకలమర్రు గ్రామాల మధ్య ఉన్న వంతెనల్లో మూడు వంతెనలు దొంగ తూముల సమీపంలోనే ఉన్నాయి. వీటిలో ఒకటి రొంపేరు కుడి కాలువ, ఒకటి రొంపేరు ఎడమ కాలువ, మరొకటి కుంకలమర్రు సమీపంలోని కొమ్మమూరు కాలువకు ఆనుకొని ఉన్నాయి. ఇవి ప్రస్తుతం రెయిలింగ్‌లు కూలిపోయి, వంతెనకు సపోర్ట్‌గా ఉండే దిమ్మలు విరిగిపోయి భయానక స్థితిలో ఉన్నాయి. ఈ వంతెనలపై నుంచే భారీ వాహనాలైన లారీలు, బస్సులు, రైతులు తమ పొలాల నుంచి పంటలను ఇంటికి తరలించేందుకు ఉపయోగించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వంతెన వద్ద ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా వాహనాలు కొమ్మమూరు కాలువలోకి దూసుకుపోవడం క్షణాల్లో జరిగిపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో అయినా వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. కుంకలమర్రు సమీపంలోని వంతెనలు కూడా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని ఎంతో కాలంగా చెబుతూనే ఉన్నారు. చీరాల నుంచి కారంచేడు మీదుగా కుంకలమర్రుకు ప్రతి రోజూ షెటిల్ సర్వీసులుగా బస్సులు తిరుగుతుంటాయి. ఈ బస్సు డ్రైవర్లు సైతం ఈరోడ్డులో అలవాటు ఉన్న వారు మాత్రమే రావాల్సి ఉంటుంది. లేకుంటే ఈ రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం వాడరేవు–పిడుగురాళ్ళ జాతీయ ప్రధాన రహదారి అయిన 167ఏ బైపాస్ పనులు ముమ్మరంగ జరుగుతున్నాయి. ఈ పనుల కోసం వినియోగించే భారీ వాహనాలు సైతం ఈ వంతెనలపై నుంచి వెళ్తుంటాయి. అధిక లోడుతో ప్రయాణించే ఈ వాహనాల వలన అవి ఎక్కడ కూలిపోతాయోనని ప్రయాణికులు హడలిపోతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



డేంజర్ జోన్‌లో రోడ్డుకు ఒక వైపు కొమ్మమూరు కాలువ, మరొక వైపు రొంపేరు ఎడమ కాలువ



కుంకలమర్రు సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న లాకుల షట్టర్లు

# ఇది కార్మికుల విజయం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు

అద్దంకి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులంతా కలిసికట్టుగా 9 రోజులు సమ్మె చేసి సాధించుకున్న కార్మిక విజయమని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మెకాలంలో కార్మికులంతా కష్టనష్టాలను పంచుకున్నారన్నారు. సమ్మె చేయటంతో ప్రభుత్వం కార్మికులు జీతం పెంచిందని వివరించారు. అయితే ప్రధాన డిమాండ్‌లు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. సమ్మెకాలంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన వివిధ ప్రజాసంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు తిరుపతిరెడ్డి, ఆర్. కోటేశ్వరరావు, శామ్యూల్, వి. జాన్, మార్కు, కె. మారుతి, ఎం. కోటయ్య, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేడింగ్ చేయడం తప్పనిసరి

మేదరమెట్ల: నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రానికి తెచ్చే ముందుగా పొగాకును గ్రేడ్ చేసుకొని కేంద్రానికి తీసుకురావాలని వ్యవసాయాధికారులు తెలిపారు. కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని అద్దంకి, కొరిశపాడు వ్యవసాయాధికారులు కొర్రపాటి వెంకటకృష్ణ, రామోహన్‌రెడ్డి, రావినూతల సొసైటీ సీఈవో కె.చంద్రశేఖర్ గురువారం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు శాతం 20 శాతం లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రేడింగ్ బాగా చేసుకుంటే క్వింటా రూ.12వేల వరకు లభిస్తుందని.. మీడియం రకం పొగాకుకు రూ. 9 వేల నుంచి రూ. 6 వేలు వరకు ధర పలుకుతుందని చెప్పారు. రైతులు గమనించి మంచి నల్లబర్లీ పొగాకు తీసుకురావాలని కోరారు.



తమ్మవరంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

# ఉపాధి పనులతో జీవనోపాధుల పెంపు

బల్లికురవ: వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం పనులతో కూలీలు జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. గురువారం కొణిదెన గ్రామంలో ఉపాధి పనులపై ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంలో ఎస్‌ఆర్‌పీ విజయభాస్కర్ మాట్లాడుతూ 2024– 25 సంవత్సరానికి గ్రామ పంచాయతీలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు చెప్పారు. తదుపరి గ్రామ సభతో లోపాలను వెల్లడిస్తామని ఆ తదుపరి ఆగస్టు 6న బహిరంగ ప్రజావేదికలో అవినీతి జరిగితే బహిర్గతం చేస్తామని వివరించారు.





ఉపాధి పనులపై కొణిదెనలో ర్యాలీ

# ఘనంగా గుర్రం జాషువా, వెంకటరమణయ్య జయంతి



సంతమాగులూరు: చిత్రపటాలకు పూలమాల వేస్తున్న గ్రంథపాలకుడు



అద్దంకి: జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గుర్రం జాషువా జయంతి వేడుకలను స్థానిక గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శిగరకొండ ఆధ్వర్యంలో గురువారం గుర్రం జాషువా 54 వర్ధంతి వేడుకలు స్థానిక పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. సందర్భంగా జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా రచనలతో సమాజంలో ఛాందసవాదంపై, సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన మహాకవి అని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అలహరి హరిప్రసాద్, జాషువా కళాపీఠం అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య రోటరీమాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లెవీ ప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, గుడా లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు.

చీరాల అర్బన్: తెలుగునాట గ్రంథాలయోద్యమానికి కృషి చేసిన మహనీయులకు గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘన నివాళులర్పించారు. పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాలకు నివాళులర్పిస్తూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్రం జాషువా తన రచనల్లో కుల, మత రహిత, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజాన్ని కాంక్షించారని బీరం సుందరరావు అన్నారు. ఈ సందర్భంగా ఉప్పుగుండూరుకు బదిలీ అయిన గ్రంథపాలకురాలు డి.ధనమ్మను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఎ.ప్రసాద్, సర్విశెట్టి సుబ్బారామయ్య, పూటుకూరి వెంకట్రావు, వెల్లంకి కృష్ణమూర్తి, వడలి రాధాకృష్ణ, శివప్రసాదరావు పాల్గొన్నారు.



చీరాల: గ్రంథాలయోద్యమానికి కృషి చేసిన వారికి నివాళులర్పిస్తున్న వక్తలు

# క్షయ వ్యాధిపై రిక్షా పుల్లర్లకు అవగాహన



రిక్షా పుల్లర్లకు అవగాహన కల్పిస్తున్న టీబీహెచ్‌వీ శ్రీలక్ష్మి

చీరాల రూరల్: క్షయవ్యాధిపై రిక్షా పుల్లర్లు అవగాహన కలిగి ఉండాలని క్షయవ్యాధి నిర్మూలన ఆరోగ్యకార్యకర్త కె. శ్రీలక్ష్మి సూచించారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆంధ్రరత్న రోడ్డులోని రిక్షా యూనియన్ వద్ద రిక్షా పుల్లర్లకు క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిక్షా పుల్లర్లు నిత్యం రోడ్లపై రిక్షాలను తొక్కుతూ జనావాసాల మధ్య ఉంటారని.. కనుక జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొగాకు, పాన్‌మసాలాలు వల్ల క్షయవ్యాధి బారిన పడతారని చెప్పారు. క్షయవ్యాధి కలిగిన వ్యక్తులు రిక్షాలు ఎక్కిన సమయంలో వారు తుమ్మినా, దగ్గినా అంటువ్యాధిలా క్షయ వ్యాపిస్తుందని తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, ధూమపానం, మద్యపానం సేవించేవారు, దగ్గు, జ్వరం ఉన్నవారు ఆర్టీపీసీఆర్ క్లే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# క్లాప్ మిత్రలకు గౌరవవేతనం

అద్దంకి: గ్రామంలో క్లాప్ మిత్రలకు గౌరవ వేతనం చెల్లిస్తామని ఎంపీడీవో శింగయ్య అన్నారు. గురువారం మండలంలోని వేలమూరిపాడులో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ మిత్రలకు గౌరవ వేతనం చెల్లించడంలో జరిగిన జాప్యాన్ని గుర్తించి ఈరోజే చెల్లించాలనే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామంలో పెండింగ్ సమస్యగా ఉన్న కొత్త వీధి లైట్ల బిగింపు కార్యక్రమం కూడా వారం రోజుల్లోపు పూర్తి చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరశీలించారు. ఉదయం 9 గంటలు దాటినా ఎవరూ రాకపోవడాన్ని గుర్తంచి కార్యకర్త, ఆయాను ప్రశ్నించారు. పిల్లలను సకాలంలో తీసుకురావాలని ఆదేశించారు. ఎఫ్ఏపై ఆగ్రహం వ్యక్తం చేసి ప్రతిరోజూ తప్పక పని కల్పించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

### ఆలయ భూములకు పెరిగిన కౌలు

బల్లికురవ: కొణిదెనలో గురువారం చెన్నకేశవ స్వామి, వేణుగోపాల స్వామి ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించారు. చెన్నకేశవ స్వామి ఆలయ భూములు 31.76 ఎకరాలను 7 ప్లాట్లుగా విభజించగా గత ఏడాది రూ. 1,95.500 పలకింది. ఈ ఏడాది రూ. 2,29, 500 పలకడంతో రూ. 34 వేలు ఆదాయం పెరిగింది. వేణుగోపాల స్వామి ఆలయ భూములు 6.10 సెంట్లను 2 ప్లాట్‌లుగా విభజించగా.. గత ఏడాది రూ. 34, 500 పలకగా ఈ ఏడాది రూ. 35,500కు కైవసం చేసుకున్నారు. శంకరస్వామి ఆలయ భూములు 36 ఎకరాలకు కౌలు వేలం జరగలేదు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# మార్కాపురంపై డ్రోన్లతో నిఘా

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో లాఅండ్‌ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అనుమానం ఉన్న పలు ప్రాంతాలను గురువారం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించినట్లు తెలిపారు. తర్లుపాడు రోడ్డు, అల్లూరిపోలేరమ్మ గుడి ఏరియా, ఇందిరమ్మ కాలనీ, చెన్నరాయునిపల్లి ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. కాగా అనుమానాస్పదంగా ఉన్న ఒక ఇంటిని సీఐతోపాటు ఎస్సై రాజమోహన్‌రావు, పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు.



ఇంటిని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

# సీసీ రోడ్డుపై వర్షం నీరు తొలగింపు



రోడ్డుపై నీరు తొలగించడంతో నడిచి వెళ్తున్న స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ ముందు భాగంలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షం నీటితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై 'పుర వీధుల్లో ప్రయాణ సంకటం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఈ.వి.రమణయ్య స్పందించారు. వర్షం నీటిని డ్రెయినేజీలోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా రోడ్డుకు ఒక వైపు కాలువ తవ్వించి నీరు ముందుకు వెళ్లేలా చేయడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. రోడ్డుపై నీరు నిల్వలేకుండా త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతాయని కమిషనర్ చెప్పారు.

### ప్రసన్నాంజనేయునికి అరటిపండ్ల పూజ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానంలో గురువారం అమావాస్య సందర్భంగా పది వేల అరటి పండ్లతో అర్చకులు ప్రత్యేకంగా పూజ నిర్వహించారు. తొలుతగా అర్చకులు, ఉభయదాతలు దేవస్థానం చుట్టూ ప్రదక్షిలు చేసి ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అరటిపండ్లతో ప్రత్యేక పూజలో ప్రసన్నాంజనేస్వామి

### శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం శ్రావణ మాసం పుష్యమి నక్షత్రం ప్యాడమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.